# అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి

- ఎన్నికల ప్రచారంలో సింగిరెడ్డి వాసంతి
- మంత్రి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి
- నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం



పెబ్బేరు మండలంలోని శాఖాపూర్ ఎన్నికల ప్రచారం చేస్తున్న సింగిరెడ్డి వాసంతి



తిరుమలాయపల్లిలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ ప్రత్యూష, తేజశ్విని



తిరుమలాయపల్లిలో కారు గుర్తుకు ఓటు వేయాలని మహిళ ను అభ్యర్థిస్తున్న డాక్టర్ ప్రత్యూష, తేజశ్విని

పెబ్బేరు, నవంబర్ 20: వనపర్తి నియోజకవర్గంలో తొమ్మిదేండ్లుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓటెయ్యాలని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి అన్నారు. సోమవారం ఆమె పెబ్బేరు మండలం శాఖాపురం, రామమ్మపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నిరంజన్‌రెడ్డిని రెండో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నలభై ఏండ్లుగా చూడని అభివృద్ధి పనులు నియోజకవర్గంలో ఇప్పుడు కనబడుతున్నాయని, ఇందుకు నిరంజన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఎంతో శ్రమకోర్చి ప్రభుత్వాన్ని ఒప్పించి ఎన్నో చారిత్రాత్మక పనులకు శ్రీకారం చుట్టారని, వనపర్తి రూపురేఖలే మారిపోయాయని పేర్కొన్నారు. సాగు, తాగునీటితో పాటు అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రజల మనిషిగా ఆయన పేరు తెచ్చుకొన్నారని చెప్పారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ప్రగతి పనులు మధ్యలో ఆగిపోకుండా ఉండాలంటే మరో సారి ఆయనను ఆశీర్వదించాలని సింగిరెడ్డి వాసంతి కోరారు. శాఖాపురంలో రూ.5లక్షలతో చింతల వాగు కాజ్‌వే బ్యాలెన్స్ పనులు, రూ.1.18 కోట్లతో సీసీ రోడ్లు, రూ.1.17 కోట్లతో భగీరథ పథకం, రూ.19 లక్షలతో కతాల్ సాబ్ దర్గా వరకు సీసీ రోడ్డు సౌకర్యం కల్పించారని వివరించారు. బీఆర్ఎస్ బలపర్చిన వనపర్తి నియోజకవర్గ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వనం రాములు, వైస్ ఎంపీపీ బాలచంద్రారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు పెద్దింటి వెంకటేశ్, శంకర్‌నాయుడు పాల్గొన్నారు.

**ప్రతిపక్షాల మాటలకు మోసపోవద్దు**

ఖిల్లాఘణపురం, నవంబర్ 20: బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని మరింత అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి, కూతుళ్లు డాక్టర్ ప్రత్యూష, తేజశ్విని అన్నారు. సోమవారం మండలంలోని తిరుమలాయపల్లిలో డాక్టర్ ప్రత్యూష, తేజశ్విని, మానాజీపేటలో సింగిరెడ్డి వాసంతి మండల, గ్రామాల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ కేవలం పదేండ్లలోనే భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంతా వందేళ్ల అభివృద్ధి చేసి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిపారన్నారు. అదేవిధంగా సీఎం కేసీఆర్ సహకారంతో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వనపర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని, విద్య, వైద్యం, సాగునీరు తదితర వాటిని తీసుకొచ్చి రాష్ట్రంలో అభివృద్ధి చెందిన జిల్లాగా నిలిపారన్నారు. వలసలకు నిలయంగా ఉన్న నియోజకవర్గానికి సాగునీరు తీసుకొచ్చి తిరిగి వలసలు వచ్చేలా చేశారన్నారు. ఖిల్లాఘణపురం మండలంలోని ప్రతిగ్రామానికి కృష్ణానీటిని తీసుకొచ్చి సస్యశ్యామలం చేశారన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపారన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతుందని, వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి మంత్రి నిరంజన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి చేసే నాయకుడిని మరోసారి గెలిపించుకొని గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. ముందుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వారికి మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

పెద్దమందడి, నవంబర్ 20: త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారంలో ప్రజలకు వివరించారు. సోమవారం మండలంలోని పామిరెడ్డిపల్లి, దొడగుంటపల్లి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ బలపర్చిన వనపర్తి నియోజకవర్గ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. తెలంగాణ పథకాలు, ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నట్లు నాయకులు చెప్పారు. అభివృద్ధి ప్రదాతను గెలిపించుకొని మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఓటర్లను కోరారు. కారుగుర్తుకు ఓ టు వేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



పామిరెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



దొడగుంటపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కావలి అశోక్‌ను అభినందిస్తున్న మంత్రి

## అయ్యప్ప భక్తుడికి మంత్రి అభినందన

వనపర్తి/పెబ్బేరు, నవంబర్ 20: వ్యవసాయ శాఖా మంత్రి నిరంజన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ రావాలని, కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ శబరిమలకు పాదయాత్ర చేసిన పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన కావలి అశోక్‌ను మంత్రి నిరంజన్‌రెడ్డి అభినందించారు. పాదయాత్రను ముగించుకొని వచ్చిన ఆయన సోమవారం మంత్రి స్వగృహంలో కలిసి ప్రసాదం అందజేశారు. అంకితభావం, వ్యయప్రయాసల కోర్చి పాదయాత్ర చేయడాన్ని మంత్రి ప్రశంసించారు.

## జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

శ్రీరంగాపురం, నవంబర్ 20: మండలంలోని శ్రీరంగాపురం, కంబాళాపురం, నాగరాల, వెంకటాపురంలో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతుంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటి ప్రచారంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసేలా ప్రచారం నిర్వహించారు. నాగరాలలోని రెండో సెంటర్‌లో గడపగడపకూ తిరుగుతూ తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటువేసి మంత్రి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పృథ్వీరాజ్, జలీల్, మహేశ్‌గౌడ్, నరేశ్ నాయుడు, రాధాకృష్ణ పాల్గొన్నారు.



నాగరాలలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అభివృద్ధి మధ్యలో ఆగిపోవద్దు

పెబ్బేరు, నవంబర్ 20: వనపర్తి ఎమ్మెల్యేగా రెండో పర్యాయం ఎన్నికల బరిలోకి దిగిన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని పెబ్బేరు మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల కర్రెస్వామి కోరారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పట్టణంలో ఇంటింటికీ తిరిగి ఈవీఎం మిషన్ చూయించి ఓట్లను అభ్యర్థించారు. మంత్రిగా ఆయన సేవలు నియోజకవర్గంలో చెరగని ముద్ర వేశాయని చెప్పారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి సాగునీటి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ప్రతి ఎకరాకు నీళ్లందించడమే లక్ష్యంగా ఆయన అలుపెరగకుండా పని చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి ప్రదాతగా నిలిచిన నిరంజన్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఆయా కౌన్సిలర్లు ముందుండి ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు.



పెబ్బేరులో ప్రచారం చేస్తున్న వైస్ చైర్మన్ కర్రెస్వామి